సాక్షి
ఏలూరు

ఆదివారం । 22 । జనవరి । 2023



బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన కోలా నాగ రమేష్, స్నేహ దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు.



28న రథసప్తమి వేడుకలు

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 28న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

శ్రీనివాసా.. గోవిందా



జంగారెడ్డిగూడెం : గోకులతిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కౌలు రైతుకు భరోసా

ఉమ్మడి జిల్లాలో 99 వేల మందికి కార్డులు

- ఏలూరు జిల్లాలో రూ.46.79 కోట్లు
- పశ్చిమగోదావరిలో రూ.53 కోట్ల రుణాలు అందజేత
- మరిన్ని కార్డులు అందించేందుకు చర్యలు

సాక్షి ప్రతినిధి,ఏలూరు: కౌలు రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వ్యవసాయ ఆధారితమైన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కౌలు రైతులకు అన్నింటా భరోసా కల్పిస్తూ వ్యవసాయాన్ని పండగ చేస్తోంది. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల పథకాలకు దూరమైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి రుణాలు మంజూరు చేయడంతో పాటు రైతు భరోసా పథకంలో ఆర్థిక లబ్ధిని చేకూరుస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఈ ఏడాదిలో ఇప్పటివరకూ సుమారు 99 వేల మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి సుమారు వంద కోట్ల పంట రుణాలను అందించారు. తద్వారా సొంత పొలం ఉన్న రైతులతో సమానంగా కౌలు రైతులకు మేలు జరగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

పక్కాగా పథకాలు

రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తున్న రైతు భరోసా లబ్ధిని కౌలు రైతులకు అందాలని జిల్లా అధికారులు నిర్ణయించి చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా భూ యజమానులకు, కౌలు రైతులకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ భూ యజమానులతో ఇబ్బందులు లేకుండా వారి హామీతో కౌలుకార్డులు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలా ఏలూరు జిల్లాలో 42 వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో 57 వేల కార్డులను కౌలు రైతులకు అందించారు. వీటి ద్వారా ఏలూరు జిల్లాలో రూ.46.79 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.53 కోట్ల పంట రుణాలను అందించి కౌలు రైతులకు సాగు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

గుర్తింపు కార్డులతో ప్రయోజనాలెన్నో..

కౌలు రైతుల గుర్తింపు కార్డుల ద్వారా బ్యాంకు రుణాలు పొందడంతో పాటు పండించిన పంటను నేరుగా ప్రభుత్వానికి విక్రయించే వెసులుబాటు కలుగుతుంది. అలాగే ప్రకృతి విపత్తులు తదితర కారణాలతో పంటలు నష్టపోయినప్పుడు ప్రభుత్వ పరిహారం కౌలు రైతులకు అందుతుంది.

పెట్టుబడికి సాయం

పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా కింద రైతులకు ఏటా పెట్టుబడి సాయం అందిస్తున్నారు. అయితే కౌలు రైతులకు సాయం అందించేందుకు



కేంద్ర ప్రభుత్వం నిరాకరించడంతో మొత్తం సొమ్ము రూ.13,500 రాష్ట్ర ప్రభుత్వమే కౌలు రైతులకు అందిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసి, కౌలు రైతులందరికీ రైతు భరోసా సొమ్ములు అందించాలని ఆదేశించింది.

3.50 లక్షల మందికి పైగా..

ఏలూరు జిల్లాలో 1.50 లక్షలు, పశ్చిమగోదావరి జిల్లాలో 2 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు వెనకడుగు వేస్తున్నారు. గతంలో కౌలు రైతులకు రుణాలు మాఫీ చేయకపోవడంతో ప్రస్తుతం సుమారు 38 వేల మంది కౌలు రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వకుండా నాన్‌పెయిడ్ జాబితాలోకి చేర్చింది. అలాగే వన్‌టైం సెటిల్‌మెంట్ పేరుతోనూ కౌలురైతులను కొన్ని బ్యాంకులు ఇబ్బంది పెడుతున్నాయి. వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని ప్రగల్బాలు పలికి గత పాలకులు ముఖం చాటేయడంతో తమకు ఈ గతి పట్టిందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం కౌలు రైతులుగా గుర్తింపు పొంది కౌలు కార్డులు పొందిన వారందరికీ తప్పనిసరిగా రుణాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే రాష్ట్ర బ్యాంకర్ల సమావేశంలో సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంకర్లకు, కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

రైతులతో సమానంగా..



సొంతభూమి కలిగిన రైతుతో సమానంగా కౌలు రైతులకు ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు ఇప్పటికే బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఏలూరు జిల్లాలో రూ.46.79 కోట్లను కౌలు రైతులకు **పంట రుణాలుగా అందించాం**. మరిన్ని రుణాలు **అందించేందుకు చర్యలు తీ**సుకుంటున్నాం.

– వై.రామకృష్ణ,
జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్

స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కౌలు రైతులందరికీ రుణాలు అందించాలి. అలాగే ప్రతి ఒక్క కౌలు రైతును గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి గుర్తింపు కార్డులు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారిస్తూ అర్హులైన వారికి కౌలుకార్డులు అందించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడం శుభపరిణామం.

– కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

ముగిసిన ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్



మాట్లాడుతున్న డీఈఓ మధుసూదనరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): **ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఇంగ్లిష్ సబ్జెక్టులో** మిగిలిన 12 ఖాళీలను పూర్తి చేయడానికి సర్దుబాటు పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రక్రియ ముగించామని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి డి.మధుసూదనరావు తెలిపారు. శనివారం ఏలూరు డీఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కౌన్సెలింగ్‌కు మొత్తం 69 మందిని పిలిచామని, జిల్లాలోని కుకునూరు వంటి ప్రాంతాన్ని కూడా ఉపాధ్యాయులు కోరుకోవడంతో కౌన్సెలింగ్ పూర్తిస్థాయిలో నిర్వహించినట్లయిందన్నారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు పొందిన వారికి వారి స్థానాల్లో ఎప్పుడు చేరేది ప్రభుత్వం నిర్దేశించిన విధంగా త్వరలో తెలియజేస్తామని తెలిపారు. ఏలూరు ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రాస్ కంట్రీ పోటీలు



అఖిల భారత పోటీలకు ఎంపికైన మహిళలు

దెందులూరు: గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో శనివారం నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ పోటీలు శనివారం జరిగాయి. 70 మంది పురుషులు, 40 మహిళా క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ కనబర్చిన ఆరుగురు పురుషులు, ఆరుగురు మహిళలను బెంగళూరులో వచ్చేనెల 12న జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ సలీం బాషా, పోటీల ఆర్గనైజర్ ప్రసాద్, ఎస్సై ఐ.వీర్రాజు, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే వాసుబాబును సత్కరిస్తున్న సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ అనంతలక్ష్మి

గణపవరం: రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రస్తుత చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి రెండోసారి నియమితులయ్యారు. ప్రభుత్వం నుంచి శనివారం ఆదేశాలు అందినట్టు ఆమె తన కార్యాలయంలో విలేకరులకు తెలిపారు. తనకు మరోసారి అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ పదవి రావడానికి సహకరించిన ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును ఆయన నివాసం వద్ద కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ రానున్నది ఎన్నికల కాలం అని, బీసీలంతా వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ, నవరత్నాల కార్యక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు.

24న నూజివీడులో ఈడీపీ

ఏలూరు(మెట్రో)/నూజివీడు: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించేందుకు ఈనెల 24 ఉదయం 11 గంటలకు నూజివీడు ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లాస్థాయి ఈడీపీ (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖాధికారి పి.ఏసుదాసు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, ఏలూరు కార్యాలయం ద్వారా అమలుచేస్తున్న పథకాల గురించి వివరిస్తారని పేర్కొన్నారు. ఎల్‌డీఎం, బ్యాంకర్లు, అధికారులు హాజరవుతారని తెలిపారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు



నియామక పత్రాలు అందించిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్యం పరిధిలో వివిధ కార్యాలయాల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామక పత్రాలను శనివారం జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అందించారు. మల్లి నవీన్‌కుమార్‌ను ఏలూరు జిల్లా పరిషత్‌లో, పతివాడ సాయి కిషోర్‌ను కాళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో, సంగడాల (కంపా) సుధారాణిని జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో, పిల్లా సాయి రాజేష్‌ను ఏలూరు జిల్లా పరిషత్‌లో, సోహన్ వికాస్‌ను ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో నియమిస్తూ ఉత్తర్వులను అందజేశారు.

ఐదో బ్యాచ్ ఆపద మిత్ర శిక్షణ

విపత్తుల సమయంలో మిత్రుల మాదిరిగా ప్రజలకు సహాయ, సహకారాలు అందించేందుకు సంసిద్ధులు కావాలని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. ఏలూరు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఏపీ ఎస్ఐఆర్‌డీ ఆధ్వర్యంలో 5వ బ్యాచ్ ఆపదమిత్ర శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30 వరకు శిక్షణ ఇస్తామన్నారు. జెడ్పీ సీఈఓ కేవీఎస్ఆర్ రవికుమార్ మాట్లాడుతూ 18 రకాల శాఖల నుంచి నిష్ణాతులైన వారిచే శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగిరాజు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ రత్నబాబు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు జిల్లా కమిటీ నియామకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వక్ఫ్‌బోర్డు జిల్లా కమిటీని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎల్.అబ్దుల్ ఖాదిర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షునిగా ఎండీ కమిలు జమా, ఉపాధ్యక్షునిగా ఎండీ అక్బర్, కార్యదర్శిగా సయ్యద్ సలీమ్ పాషా ఖాద్రీలను నియమించారు. అలాగే షేక్ సుభాని, షేక్ సర్దార్, అబ్దుల్ రవూఫ్, షేక్ జమాల్ షరీఫ్, షేక్ రెహమతుల్లా, సయ్యద్ బాజీ, షేక్ రెహమతుల్లా, షేక్ మొహమ్మద్ జహీర్‌ను కమిటీ సభ్యులుగా నియమించారు.

గ్రామీణ క్రీడల అభివృద్ధికి కృషి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



విల్లు ఎక్కుపెట్టి పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి, జెడ్పీ చైర్మన్ కవురు, ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని, గ్రామీణ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం టీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5 రోజులపాటు జరిగే ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు మండల, గ్రామీణ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి శిక్షణ అందించి అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలల్లో క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల ప్రోత్సాహానికి జిల్లా పరిషత్ నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో యువతకు వాలీబాల్, కబడ్డీ, విలువిద్య తదితర ఆటల పోటీలను నిర్వహిస్తున్నామని, ఈనెల 26న విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. తొలిరోజు ఆటల పోటీలకు 200 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర అతిరాశుల సంఘం అధ్యక్షుడు ఇళ్ల భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ కరాటం సీతాదేవి, ఎంపీపీ కారం శాంతిరమణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, జిల్లా నాయకులు ఆరేటి సత్యనారాయణ, ఆర్‌డీఓ కె.ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమకు మరింత ప్రోత్సాహం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జిల్లాలో పట్టుపురుగుల పెంపకాన్ని (సెరీ కల్చర్) మరింత విస్తరించడంతోపాటు పెద్ద ఎత్తున మహిళలను ఈ రంగంలో ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం కేంద్ర పట్టుపరిశోధన, శిక్షణ సంస్థ మైసూర్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్ పట్టు పరిశ్రమల ఆధ్వర్యంలో బైవోల్టేన్ సెరీ కల్చర్‌తో స్థిర ఆదాయం-ఉత్పాదకత పెంచేందుకు అనుసరించాల్సిన సాంకేతిక పరిజ్ఞానంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన మల్బరీ సాగు రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మల్బరీ సాగు ప్రోత్సాహానికి వర్క్‌షాప్ మంచి వేదిక అన్నారు. ఏలూరు జిల్లాలో 1,500 ఎకరాల్లో 570 మంది రైతులు సెరీకల్చర్ సాగుచేయడం అభినందనీయమన్నారు. మహిళలను ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. మల్బరీ విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి ప్రోత్సాహకాలను అందిస్తున్నాయన్నారు. ఆటోమెటిక్ రీలింగ్ యూనిట్ల స్థాపనపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు పీఎంఈజీపీ ద్వారా రాయితీతో కూడిన రుణాలు పొందవచ్చన్నారు. 100 మంది రైతులు కామన్ క్లస్టర్ సెంటర్ ఏర్పాటు చేసుకుంటే ప్రోసెసింగ్ యూనిట్లకు రాయితీ వస్తుందన్నారు.

ఉత్తమ రైతులకు సత్కారం

సెరీకల్చర్ సాగులో ఉత్తమ రైతులుగా నిలిచిన బైర్ల వీరయ్య (ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం), కుంపటి కృష్ణారావు (కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం వెలివోలు), లంకా చిటికలు (కాకినాడ జిల్లా), కొమ్మన ఉమ (తూర్పుగోదావరి జిల్లా నరేంద్రపురం), పమిచిన సత్యవతి (అల్లూరి సీతారామరాజు జిల్లా కింద్ర), జెట్టి చిన కేదారయ్య (ఏలూరు జిల్లా కేతవరం), సిరిఎం కన్నపురాజు (లంకలపల్లి), కాలి కొండలరావు (రామారావుగూడెం), కొమ్ము కుటుంబరావు (చాట్రాయి మండలం చిన్నంపేట)ను కలెక్టర్ శాలువా, మెమెంటోలతో సత్కరించారు. అనంతపురం కేంద్ర పట్టు పరిశోధన, శిక్షణ సంస్థ ప్రధాన శాస్త్రవేత్త కేపీ కిరణ్‌కుమార్, మైసూర్ కేంద్ర పట్టు పరిశోధన, శిక్షణ సంస్థ డైరెక్టర్ మేరీ జోసఫ్, ఏపీ సెరీకల్చర్ అడిషనల్ డైరెక్టర్ సి.అరుణ కుమారి, కృష్ణగిరి ఆర్ఈసీ శాస్త్రవేత్త డా. కె.ఝాన్సీలక్ష్మి, సీఎస్ఎస్‌బీ రిటైర్డ్ శాస్త్రవేత్త పి.సుధాకర్, గుంటూరు సెరీ కల్చర్ డీడీ సాజిదాబేగం, జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

మరో మూడు స్కిల్ హబ్స్

జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో స్కిల్ హబ్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించగా మొదటి విడతలో నాలుగు హబ్‌లు ప్రారంభించగా రెండో విడతలో మూడు స్కిల్‌హబ్‌లు ప్రారంభిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో స్కిల్ హబ్ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. డీఆర్‌డీఏ పీడీ కె.వి జయరాజు మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేసి 18–30 ఏళ్ల వయసున్న అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణా కాలంలో స్టయిఫండ్ కూడా ఇస్తున్నామని, మరిన్ని వివరాలకు సెల్ 8978524022 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కానిస్టేబుల్ పరీక్షలకు సర్వం సిద్ధం



కేంద్రాల వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు టౌన్: ఏపీ రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపడుతున్న కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు. సుమారు 14 వేల మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉంది. శనివారం ఏలూరులోని సీఆర్ఆర్ ఆడిటోరియంలో పరీక్షల బందోబస్తుపై సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో సదుపాయాలు ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కేంద్రాల్లో అధికారులు సెల్‌ఫోన్లు వినియోగించరాదన్నారు. ఆటోడ్రైవర్లు అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు సకాలంలో తీసుకువెళ్లేలా సహకరించాలని కోరారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు చేపట్టామన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఉప రవాణా కమిషనర్ ఎం.పురేంద్ర ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రత, సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడాది కాలంలో రోడ్డు ప్రమాదాల కారణంగా 333 మంది ప్రాణాలు కోల్పోగా 847 మంది గాయాలు పాలయ్యారన్నారు. మరణాలు, క్షతగాత్రులను గణనీయంగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాదేపల్లి రోడ్డు, జూట్ మిల్లు నుంచి మినీ బైపాస్ మీదుగా బస్టాండ్‌కు వెళ్లే రహదారిలో లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆశ్రమం ఆస్పత్రి నుంచి ఏలూరు బస్టాండుకు వచ్చే మార్గంలో ఆక్రమణలు తొలగించాలన్నారు. భీమడోలు సీహెచ్‌సీలో ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో 62 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించారన్నారు. జేసీ పి.అరుణ్‌బాబు పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీలో పశ్చిమ శుభారంభం

ఆత్మకూరు: రాష్ట్రస్థాయి అండర్-14, 17 నెట్‌బాల్ టోర్నీ ఆత్మకూరులో శనివారం ప్రారంభం కాగా, పశ్చిమ జట్టు శుభారంభం చేసింది. తొలిరోజు అండర్-14 బాలుర విభాగంలో వెస్ట్ గోదావరి కృష్ణాపై 11-0, అనంతపురం వెస్ట్ గోదావరిపై 6-3 గోల్స్ తేడాతో విజయం సాధించాయి. అండర్ 17 బాలికల విభాగంలో వెస్ట్ గోదావరి జిల్లా జట్టు కృష్ణా జిల్లా జట్టుపై 5-1 తేడాతో గెలుపొందింది.

పెండింగ్ కేసులను సత్వర విచారణ చేయాలి

- రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్
- ఏలూరులో ఉమ్మడి జిల్లా న్యాయమూర్తులతో సమావేశం




ఏలూరు జిల్లా కోర్టులో సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, సమావేశానికి హాజరైన జడ్జిలు

ఏలూరు (టూటౌన్): కోర్టుల్లోని పెండింగ్ కేసులను సత్వర విచారణ చేయడం ద్వారా వాటి పరిష్కారానికి న్యాయమూర్తులు కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించే విధంగా న్యాయమూర్తులు పనిచేయాలన్నారు. తద్వారా న్యాయవ్యవస్థపై ప్రజలకు ఒక విధమైన నమ్మకం, గౌరవం ఏర్పడుతుందన్నారు. కోర్టులలో పెండింగ్ కేసులు విచారణ, తీర్పులు త్వరితగతిన చేయటానికి ఉన్న అవకాశాలపై సమావేశంలో ఆయన న్యాయమూర్తులతో చర్చించారు. సాధారణ పరిపాలనా పరమైన పర్యవేక్షణలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో భాగంగా ఆయన న్యాయమూర్తులకు తగు సూచనలు, సలహాలు అందించారు. సమావేశానికి ముందుగా ఆయన కోర్టు ఆవరణను పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు పీపీలు, ఏపీపీలు జడ్జిని కలిసి జిల్లా కోర్టు ప్రాంగణంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ జిల్లా కోర్టు ఆవరణలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కు ఘన స్వాగతం

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్‌కు జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించే జిల్లా న్యాయాధికారుల సమావేశంలో పాల్గొనేందుకు ఆయన శనివారం ఏలూరు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ గెస్ట్‌హౌస్‌లో కొంతసేపు బస చేశారు. ఆయనను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ్ కుమార్, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ వారితో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏలూరు ఆర్‌డీఓ పి.పెంచల కిషోర్, తహసీల్దార్ సోమశేఖర్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు బీవీ కృష్ణారెడ్డి, పలువురు న్యాయమూర్తులు హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సమస్యలపై న్యాయ ఉద్యోగుల వినతి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తుల సమావేశానికి విచ్చేసిన హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్‌కు ఏపీ న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ నాయకులు కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మాదిరెడ్డి రాము ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘం నాయకులు హైకోర్టు జడ్జిని కలిశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందజేస్తానని తెలిపారు. హైకోర్టు జడ్జిని కలిసిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి సత్యనారాయణ, సహాధ్యక్షురాలు ఎస్.గీత, ఉపాధ్యక్షుడు వి.నరసింహమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి వి.రాఘవేంద్రరావు, సహాయ కార్యదర్శి అన్నే శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా జడ్జి పురుషోత్తం, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ

రూ.5.50 లక్షల విలువైన ఎరువుల సీజ్



కలిదిండిలో ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న దృశ్యం

కైకలూరు (కలిదిండి): కలిదిండిలోని ఓ దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వ చేసిన 5 టన్నుల వివిధ రకాల ఎరువులను వ్యవసాయాధికారులు శనివారం సీజ్ చేశారు. కైకలూరు ఏడీఏ ఆర్.గంగాధరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో మండలంలో ఎరువుల దుకాణాలను తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో కలిదిండిలోని వినాయక ఆక్వా ఏజెన్సీ గోడౌన్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా యూరియా, సూపర్, పొటాష్, 28-28 కాంప్లెక్సు ఎరువులు, జింక్ సంబంధిత ఎరువులు నిల్వ చేసినట్లు తనిఖీల్లో తేలగా, వీటిని సీజ్ చేశామన్నారు. వీటి విలువ రూ.5.50 లక్షలు ఉంటుందన్నారు. దుకాణ యజమాని పోతన వంశీపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి జేసీకి నివేదిక పంపించామన్నారు. ఎరువుల విక్రయ దుకాణదారులందరూ తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. విధిగా లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. తనిఖీల్లో కలిదిండి ఏఓ సాగర్, వీఆర్వో గుడిపాటి శేష శ్రీనివాస్, ఎరువుల డీలర్ నీలి వెంకటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.వెంకన్న, బి.ఫణికుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

యలమంచిలి: చించినాడ హైవేలో కలగంపూడి వద్ద శనివారం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం మాట్ల గ్రామానికి చెందిన బొమ్మిడి వెంకటరెడ్డి (20) తూర్పు గోదావరి జిల్లా బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా కలగంపూడి వద్ద ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు రోడ్డు నుంచి స్కూల్ లోపలకు అకస్మాత్తుగా రోడ్డు క్రాస్ చేయడంతో వెంకటరెడ్డి నేరుగా బస్సును ఢీ కొట్టాడు. దీంతో అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తండ్రి గోవిందరాజులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తెలిపారు.

● ఇంటింటికీ సంక్షేమం



నిడమర్రు: బువ్వనపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వృద్ధురాలికి బ్రోచర్ అందిస్తూ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



ఆగిరిపల్లి: నెక్కలం గొల్లగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

4.50 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



కలపర్రు వద్ద పట్టుకున్న రేషన్ బియ్యం, లారీతో విజిలెన్స్ అధికారులు

పెదపాడు: లారీలో అక్రమంగా తరలిస్తున్న 4.50 టన్నుల రేషన్ బియ్యాన్ని కలపర్రు ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద విజిలెన్స్ అధికారులు పట్టివేశారు. కలపర్రు వీఆర్వో సాయల వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెనాలికి చెందిన గొంది అశోక్ తెనాలి నుంచి తణుకు మండలం దువ్వలోని చింతా మల్లేశ్వరరావుకు మినీలా లారీలో ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంతో కలపర్రు ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద విజిలెన్స్ ఎస్సై రంజిత్‌కుమార్ నిఘా వేసి మినీ లారీని పట్టుకున్నారు. తెనాలి మండలం జగడగుంటపాలెంకు చెందిన కలవకొల్లు మధుబాబును అరెస్టు చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సీఎస్‌డీటీ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

కత్తిపీటతో భార్యపై దాడి

- తాను పీకకోసుకుని ఆత్మహత్యాయత్నం
- భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం

బుట్టాయగూడెం: భార్యాభర్తల మధ్య గొడవతో కోపోద్రిక్తుడైన భర్త భార్య తలపై కత్తిపీటతో దాడి చేసి తానూ అదే కత్తిపీటతో పీక కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జీలుగుమిల్లిలో జరిగిన ఈ ఘటనలో భార్యను మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందగా, భర్త పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీలుగుమిల్లిలోని రామన్నపాలెం కాలనీకి చెందిన ఉర్లా ఆంజనేయులు (రామదాసు), అతని భార్య శ్రీలతకు మధ్య ఇటీవల తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం కూడా భార్యాభర్తల మధ్య గొడవ రావడంతో మాటామాటా పెరిగింది. దీంతో భర్త ఆంజనేయులు కోపంతో కత్తిపీటతో శ్రీలతపై దాడి చేసేందుకు ప్రయత్నించగా, ఆమె భయంతో వేరే ఇంటికి వెళ్లగా, వెంటపడి మరీ దాడి చేశాడు. అనంతరం అదే కత్తిపీటతో తన మెడ కూడా కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. రక్తపు మడుగులో ఉన్న శ్రీలత, ఆంజనేయులును స్థానికులు 108లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించారు. అయితే శ్రీలత పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏలూరు, విజయవాడ తరలించేందుకు ప్రయత్నించగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై చంద్రశేఖర్ ఆస్పత్రికి చేరుకుని వివరాలను సేకరించారు. జీలుగుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రథమ చికిత్స అనంతరం శ్రీలతను మెరుగైన చికిత్స కోసం తరలిస్తున్న దృశ్యం

వాలీబాల్ జాతీయ పోటీల రిఫరీగా అమరేందర్ బాబు



అమరేందర్‌బాబు

కైకలూరు: వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (వీఎఫ్ఐ) ఆధ్వర్యంలో అసోం రాష్ట్రంలో త్వరలో జరిగే జాతీయ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు రిఫరీగా కైకలూరు మండలం పల్లెవాడ గ్రామానికి చెందిన బీసాబత్తిన అమరేందర్ బాబు ఎంపిక య్యారు. ఈ మేరకు వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ అనిల్ చౌదరి నుంచి ఆహ్వాన లేఖ శనివారం అందింది. ఫిబ్రవరి 2 నుంచి 9 వరకు పురుషులు, స్త్రీల 71వ సీనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు అసోం సరుసజై స్పోర్ట్స్ కాంప్లెక్స్ నబిన్ చంద్ర బార్డోలోయ్ ఇండోర్ స్టేడియంలో జరగనున్నాయి. సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు అమరేందర్ బాబు స్పోర్ట్స్ కోటాలో దక్షిణ మధ్య రైల్వేలో సీనియర్ టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రైల్వే జట్టుకు సేవలు అందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.